# మూలింటామె

నామిని



# మూలింటామె



టామ్ సాయర్ బుక్స్

211, అన్నమయ్య టవర్స్

యాదవ కాలనీ, తిరుపతి – 517 501

ఫోన్:(0877)2242102

# మూలింటామె

–నామిని

మొదటి ముద్రణ : ఏప్రిల్, 2014

కవర్ మీది బొమ్మలు : పి.సి. నరసింహారెడ్డి **(శుక్తి)**

కవర్ డిజైన్ : 'మోహన్'

ప్రచురణ : టామ్ సాయర్ బుక్స్, తిరుపతి

ముద్రణ : అరుణోదయ, హైదరాబాద్.

ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బ్రాంచీలూ,
నవోదయ, కాచిగూడ, హైదరాబాద్

**వెల : 70 రూపాయలు**

ఒకప్పుట్లో నాకు ఊపిరి పోసిన

మా డాక్టర్ కొండారెడ్డి (ఎస్.జాజిరెడ్డి)కి ...

# మొదుటి బాగం

మంచి శుక్రోరం. సందల గూకతా వుండాది. రేపనంగా తిరమల శనోరం, మూడో వారం. తిరమల నెల్లో వానొగటన్నా పడతాది గదా. ఈ పొద్దు మద్దేనం వుమ్మగిం చిందాన్ని బట్టి మూలింటామె అనుకున్నట్టే దచ్చిన కొండ మింద ఎండ వొక పక్క కాస్తా వుండినా వూళ్లో వాన కుమ్మరించి పారేసింది. ఈదిలో యెల్లవ గూడా సాగింది. అందాకా కూడొంచి నూరి పెట్టిన చారు పెడదామనుకునిందల్లా, యీ వానొచ్చిందానికి సంగటి కెలికి, అద్దుడికి శెనిగ్గింజలూరిబిండి చేస్కోని, నంజుకునే దానికి మునగాకు పొరుటుకుంటే అణుకణుగ్గా సంగటి తినొచ్చని మనవరాలితో, "మ్మే! అన్ని శెనిగ్గింజలేంచు, నేను మునగాకు దుస్తా!" అని మునగాకు దుసి చేటతో కూడా యిచ్చింది. తెల్లారి చద్దితో సఖా ఏడెనిమిది ముద్దలు జేసేసి, శెనిగ్గింజలూరుబిండి నూరేసి, మునగాకు పొరిటేసి – యిప్పుడే బయిటికో యాడికో పొయ్‌నట్టుండాది మూలింటామె మనవరాలు రూపావొతి.

మూలింటామె పేరు కుంచమమ్మ. వూళ్లో పరంట పక్క వొక మూలన వాళ్ల అద్దా పిల్లుంటాది. వూరికి తూరుప్పక్కా, వుత్తర పక్కా మూల మింద యిండ్లుండినా వాళ్లెవ్వరికీ రాని పేరు వీళ్లకే వొచ్చింది 'మూలింటోళ్లు' అని. మూలింటామె వొగిసోళ్లు గూడా మూలింటామెను 'కుంచమమ్మా!' అని పిలిచిన పాపాన పోరు. 'ఏమే మూలిల్లా!' 'ఏమే మూలింటిదానా!' 'చెప్పే మూలింటామే!' – యిదే వాటం. ఆ యింట్లో మూలింటామెతో పాటు ఆమె కొడుకూ, ఆమె కూతురూ, మనవరాలూ – యీ యిందురికీ మూలింటి పేర్లే వొచ్చినాయి. మూలింటామె కొడుకు పేరు నారాయణసామి నాయుడు. ఆయన్ని గూడా ఆ నాలుగూళ్లల్లో 'మూలింటాయన', 'మూలింటోడు' అనే అంటారు. మూలింటామె మొగుడు – అగ్గో కూతురు పాలు మరిచి పొయ్యిందో లేదో వాతీ బేదీ తగిలి చచ్చిపొయినాడు. మూలింటామెకు ముందు కొడుకు పుట్నాడు, మళ్ల కూతురు. మొగుడు జచ్చిపొయ్‌న యీ నలపైయ్యేండ్లలో మూలింటామె మంచి శాల్తయిన ఆడది గాబట్టి సేద్దిం నాద్దిం జరిపించుకుంటా యిద్దురు బిడ్డల్నీ పెంచి పెద్ద జేస్కొనింది. పెద్ద మనిసి

అయ్యా కాకనే కూతురికి పెండ్లి జేసింది. ఆ కూతురికి గూడా తల్లి సాలే వొచ్చినట్టుండాది, వొక బిడ్డ తల్లి కాంగానే ఏందో సంగటంతో మొగుడు జచ్చిపోతే తాడు తెంపుకోని అమ్మగారింటికే వొచ్చింది. సొత్తులో సొత్తు వుండిపోతాదని చెప్పి మూలింటామె కూతురి బిడ్డనే కొడుక్కి కట్టబెట్టి కోడాల్ని జేస్కొనింది. ఇప్పుడా అడ్డాపింట్లో ముగ్గురాడోళ్లుండారు గదా. ఇంట్లో పెద్దామె ఐన కుంచమమ్మ 'మూలింటి మొదుటామె'గా, ఆమె కూతురు మొగిలమ్మ 'మూలింటి నడిపామె'గా, మొగిలమ్మ కూతురు రూపావొతేమో 'మూలింటి కొనమ్మి'గా, 'మూలింటి చిన్నమ్మి'గా పేరెత్తుకున్నారు.

బాగ మొబ్బడి పొయ్యింది. మడి కాణ్నుంచి ఎద్దులొచ్చి కొట్టంలో నిలబడినాయి. ఆ యెనకాన్నే అన్నా చెల్లీ, యింకా చెప్పాలంటే అత్తా, అల్లుడూ – అత్త పచ్చి మేతనూ, అల్లుడు ఎండు కసువునూ నెత్తిన పెట్టుకోని యింటి ముందర చేరినారు. మామూలుగా అయితే నారాయణ సామి ఎద్దల్ని గాట్లో కట్టేసి, అడ్డాపింటి ముందరుండే కసువు పందిట్లోకి వొచ్చే సరికల్లా ఆయన పెళ్లాం గుండుచెంబుతో చిట్టుడుకు నీళ్లు బోస్కోని వుప్పు కరగ దీసుకుంటా వొచ్చి చేతికందియ్యాల.

మట్లో ఆట్లాడుకుంటా వుండే మనవణ్ణీ, మనవరాలినీ జూసి నడిపామె, "సందలగూక కొనమ్మి యాడబొయ్యింది? మడి కాణ్ణుంచి మొగోడొస్తానే చిట్టుడుకు నీళ్లు కలిపీకుండా చిన్నమ్మి యాడబొయ్యిందమా! చంకలో బిడ్డను గూడా ఎత్తుకోని పోకుండా చిన్నమ్మి యాడ అరట్లు కొడతా వుండాది?" అని మొదుటామెతో అంటా మనవరాల్నెత్తుకోని చంకనేసుకొనింది. అందాక గమ్మనుండిన మనవరాలు దేనికనో ఏడ్చేదానికి పెట్టుకోవడంతో, బిడ్డిని వూగించుకుంటా, "లొడలొడ లొట్టీ! నా తాటాకుల బుట్టీ!" అని లొల్లొల్లొల్లా అంటా అడ్డాపింట్లోకి పొయ్ దీగూడు కల్లా జూసింది. నట్టింట దీగూట్లో పచ్చి అద్దారపాకు, ఆ అద్దారపాకు మింద చలవ, దాని మింద ఇత్తడి దీపింలో వొత్తి మలగతా వుండాది దగద్దమానంగా.

"నట్టింట దీపిం గూడా బెట్టి తలుపు వారాకులగా గూడా యెయ్యకుండా బరాబైలుగా తెరిచేసి చిన్నమ్మి యాడబొయ్‌నట్టమా?" అని మొదుటామెతో అంటా అడ్డాపింటి యెనక్కి బొయ్, వొకేళ కయ్యలోకి బయిటికి పొయ్యిందేమో అని వూరెత్తక పొయ్యేటట్టు, "చిన్నమ్మీ! ఓ చిన్నమ్మీ! కొనమ్మీ! ఓ కొనమ్మీ!" అనీ, ఎప్పుడూ లేంది పేరు బెట్టి, "రూపావొతా, వో రూపావొతా!" అనరిచింది నడిపామె.

కసువు పందిట్లో నులక మంచం కోదు మింద పైగుడ్డ చుట్టగా బెట్టుకోని తలానించి యెల్లాలకల పొనుకోనుండిన నారాయణ సామి, చెల్లితో, "దేనికామాదిర్తో ఆగిత్తం బట్టిస్తుండావు? దిగీదికేమన్నా పొయ్యుంటాదేమో, పొయ్‌న మనిసి తిరుక్కోని రాదా! గమ్మనుండు." అన్నాడు. 'ఏందిదీ, ఎక్కడిదీ' అనుకుంటా మూలింటి మొదుటామె యేపచెట్టు కిందుండే బండ మింద కాళ్లు జాపేసి కుచ్చోనుండాది. కూటేళయి

పొయ్‌నట్టుండాది. బాలింతరాలైన పిల్లి దాని పిల్లల్ని మూడిట్ని యెంటేసుకోని మొదుటామె చుట్టూతా అరస్తా చుట్టకలాడతా వుండాది. నాయంగా అవితే యీపాటికి మొదుటామె మనవరాలు బిడ్డలిద్దర్నీ పెళ్లో నిలపెట్టి బకిడీతో బకిడీడు చిట్టుడుకు నీళ్లతో వొళ్లుకు బోసి, మొకాలకు పొగ్రడ బూసి, బిడ్డల పిల్లికి అంత సంగటీ మజ్జిగా పిసికి వారగా, యవా దశలో వుండే మిగతా మూడు పిల్లులకీ వారగా మూకుళ్లల్లో పెట్టేసుండును. బిడ్డలనుకోకుండా, పిల్లులనుకోకుండా యాడ ఎరగనోచ్ అని వుండాదీ అమ్మి! – తలకాయి నొచ్చుతా వుండాది మొదుటామెకి.

కూతురి కోసరం వూరొక చుట్టు తిరుక్కోనొద్దామని చెప్పేమో నడిపామె మనవరాల్ని చంకనేస్కోని యీదిన బడి పోతా వుంటే, రెండు మూకుడు మూతల్లో ఎలక్కాయంత సంగటేసి, సంగటి మునిగేటట్టు మజ్జిగ బోసి పిసికి పిల్లులకు తనీ, తనీగా పెట్టింది మొదుటామె. కాళ్లను రాపాడతా తోకలు పైకెత్తుకోని తింటా వుండాయి పిల్లులు. జేజవ్వ పిల్లులకు బువ్వ బెట్టి, వాటి నడీమద్దెన నిలబడుకోనుంటే మనవడు కాళ్లకాడ గొంతు కూచ్చుని పిల్లులకల్లా చూస్తుండాడు. పిల్లులు యింకా పూరాగా తినక ముందే కూతురు యెనకాన లేకుండా వొట్టి చేతుల్తో వొంటిగా చేతులూగించుకుంటా వొచ్చిన నడిపామె, “ఆ పిల్లులకిప్పుడు ఆరక పొయ్యిందా! యిసన కట్టైత్తుకోని యిసురు!” అనింది యాష్టగా.

సుర్రమనింది మొదుటామెకి. “పచ్చి బాలింతరాలనుకో. ఆ పిల్లినేమిటికి బొక్క లాడతావు? నీ మొగుడి సొత్తేమీ వాటికి వొండి వోర్చలా. నా మొగుడి సొత్తే. నువ్వు కొంచిం తగ్గు” అని మాటల్తో కూతురి పైబడ పొయ్యింది. ఈ యింట్లో ఆ పిల్లుల రాణివాసం అట్టాంటిది.

కూటి బొవాణెత్తుకోని చాకలామె యింటి ముందరికొచ్చే సరికి నడిపామె యింట్లేకి పొయ్ సంగటి ముద్దా, అంత శెనిగ్గింజలూరుబిండీ, అంత మునగాకు పొరుటూ తెచ్చి బొవాణిలో యేస్తా వుంటే, “ఏందిదా! చాకలామె కూటి కోసరమొచ్చేశ. యీ యింట్లో పిల్ల నట్టింట్లో దీపింబెట్టేసి యాడబొయ్యిందమ్మా! యిదేమి యిచ్చిత్రం తల్లా!” అని నిరామయమై పొయ్యింది మొదుటామెకి.

దీనికి నడిపామె, “నీ ఏడు పిల్లులూ నీ కండ్ల ముందరుండాయి గదా, మజ్జిగా కూడూ బాగ తిన్నాయి గదా, యింకేమి నీకు, బాదా బదనాయమా?” అని ఎద్దు మంచమెక్కినట్టు మాట్లాడింది. యింకొకప్పుడవితే బదులు నాలుగనుండేదే! యాడ, నోట్లో తేమ లేకుండా అయిపోతుంటే…! కాళ్లూ జేతులూ చల్లబడి పోతావుంటే! కుయ్యాం కయ్యాం అనకుండా మొదుటామె గమ్మనుండి పొయ్యింది.

నారాయణ సామి గమ్మన పొనుకున్నోడు పొనుకున్నట్టే వుండాడు. మిట్టూరు మొత్తానికీ వొళ్లుకు నీళ్లు పోసుకోకుండా, కడుపుకంత తినేసి చెయ్యి కడుక్కోకుండా

వొక్క పిట్టి కోడి గూడా వుండుండదు. చాకలోళ్ల యీది గూడా సద్దుమణిగి పొయ్యింది. మూలింటామె యింట్లో మాత్రం లేదర పిలకాయలు గూడా యింకా వొళ్లుకు బోసుకోలా. గబగబా పొంతలో నీళ్లు బకిడీలోకి తోడి బిడ్డల్నిద్దర్నీ పెళ్లోకి తొడకపొయ్ నీళ్లు పోసిన సాంగిం చేసింది నడిపామె. గిన్నిలో ఎలక్కాయంత సంగటేసి బిడ్డలిద్దురికీ అంత తినిపించింది. యిందాక 'అమ్మ అమ్మ' అంటా ఏడ్చిన పిలకాయలు యిప్పుడు గమ్మనుండి పొయ్నారు. నట్టింట్లో సిరిచాప పరిస్తే పాపం బిడ్డలు మైకం కమ్మినట్టుగా నిద్ర పూడ్చినారు గూడా. సమ్మచ్చురం తేడాతో ఆ అన్నా చెల్లికి అయిదారేండ్లు గూడా వుండవు.

నులక మంచం మింద యింగా గోయిందరాజుల సామి మాదిర్తో పొనుకోనుండిన అన్నను చూస్తా వుంటే అయ్యోమనిపించింది నడిపామెకు. నారాయణ సామి అన్నే అయినా, ఒకటీ ఒకటిన్నర సమ్మచ్చురమే వారా గాబట్టి నూటికొకసారి మాత్రమే 'అనా!' అని పిలిచే వాడిక నడిపామెకి. 'ఒరే' అనో, 'రేయ్ నారాయుడా!' అనో పిలస్తా వుంటాది. అన్ననే అల్లుడిగా జేసుకున్నాక అయితే, యీ ఏడేండ్లుగా ఒక్కసారి గూడా 'అనా!' అని పిలిచింది గాదు. అట్టాంటిదా రేత్రి పూట, "అనా లెయ్ అన్ని నీళ్లు తోడతా. పోసు కుందువు." అని చెల్లి అనంగానే ఆ అన్న మాటతో గూడా పైకి లేచి పెళ్లోకి పొయ్నాడు. నడిపామె అన్నకి సబ్బేసి వొకిటికి మూడు మాట్లు యీపు రుద్దతా వుంటే, బండ మింద కాళ్లు జాపేసి కుచ్చోనుండిన మొదుటామెకి ఏమీ అర్తం గాలా. కొడుక్కి ఎంత వందనంగా, ఎంత అబ్బనాకారంగా యీపు రుద్దేది మనవరాలు! కొడుక్కి పెండ్లయినాక యీ మంచి శుక్రోరం పూట మనవరాలు గాకుండా కూతురు యీపు రుద్దతా వుండడం చూస్తా వుంటే కండ్లు బూసులు కమ్మతా వుండాయి మొదుటామెకి.

యాడలేని సత్తానంతా కూడదీస్కోని పెడి కాడికి పొయ్, ఇంట్లో నుంచి చలవ జేసిన పంచా పైగుడ్డా ఎత్తుకోని తడిక మింద పెడతా వుండిన కూతురితో, "నా కూతరా! నా కున్ని మనవరాలు యాడబొయ్యిందే నా కూతరా! కనపడక జాము సేపాయనే!" అని కంటికి కడవడు నీళ్లు బెట్టుకోని బొరోమని ఏడ్చేసింది. మొదుటామె కండ్లల్లో నీళ్లు చింతగింజలు దూకినట్టు దూకతా వుండాయి.

నడిపామె గూడా ఆమెలో ఆమే ఎగదీసుకుంటా వుండాది. కూత బైటికి రాకుండా కండ్లల్లో నీళ్లను కండ్లల్లోనే అణసర జేసుకుంటా పెళ్లో నీళ్లు బోస్కోని బైటికొచ్చిన అల్లుడికి పీట వాల్చి ముద్ద సంగటేసి, శెనిగ్గింజలూరుబిండీ, నంజుకునే దానికి మునగాకూ పెట్టింది నడిపామె. తలొంచుకోని ముద్దా తినేసి, చెల్లి రెండో ముద్ద తెచ్చినా పీట మింద వుండకుండా పైకి లేచి పెళ్లోకి పొయ్ చెయ్యి కడుక్కోని నులక మంచం మింద వాలిపొయ్నాడు నారాయుడు.

ఈ యింత సేపుటిగ్గానూ, "ఏమిరే నారాయుడా! రొండు ముద్దలు తినే వోడివి ఒక్క ముద్దతోనే సరిపెడితివేమి రే నారాయుడా!" అంటా కొడుకుతో మాట్లాడింది మొదుటామె. నోరు తెరవకుండా బీడీ ముట్టించుకోని తాగతా వుండి పొయ్నాడు కొడుకు.

టయింం నిజానికి ఎనిమిది దాటకున్నా నడిరేత్రి దాటినట్టుగా అనిపిస్తా వుండాది మొదుటామెకి. సందేళ మంచి తేప వొకటి పడింది గదా, మూలింటి యెగవన వుండే గుంటలో నుంచి కప్పలు నిలుకు లేకుండా అరస్తుండాయి. వూరి చుట్టూరా చెరుకు తోటలే. పొట్టి నక్కలు రవ్వాటిస్తా వూళలేస్తుండాయి. అరదట్లుగా ఒక పక్క యెన్నిల కాస్తుండినా యీ శబద్దాలను బట్టి మొదుటామెకు బిత్తరగా వుండాది.

మనవరాలు ఏ పొద్దు గడప దాటి, యీది దాటి దిగవీదికి పొయ్యిందని! ఆ యమ్మి కోసరం నడిపమ్మి వూరు చుట్టేసి రావడం ఏంది? అది రేపటేళ గానీ, మాటేళ గానీ ఒకరి కొంపకు అగ్గిపెంకెత్తుకోనైనా నా మనవరాలు అగ్గికి పొయ్యుండునా? వూరు ఒక చుట్టు చుట్టేసొచ్చినప్పట్నుంచి కూతుర్ని పరీచ్చగా చూస్తానే వుండాది మొదుటామె. దేముడి సత్యానికి ముక్కులో వూపిరి పెట్టుకోనున్నట్టుండాది నడిపమ్మి. వుడుకు నీళ్లు పోసుకోని బకిడీని పెళ్లోకి ఎత్తకపొయ్యే దానికే చావు దంపులై పొయ్యింది యిందాక కూతురు! మూలింటామె గుడ్డి ముసిల్దా ఏమన్నానా! కడుపులో ఏందో గంపడంత పెట్టుకోనుండాది అనిపిచ్చింది మొదుటామెకి నడిపమ్మిని చూస్తా వుంటే!

యింత జరగతా వుండినా గమ్మున బండ మింద నుంచి దిగి యింట్లేకి పొయ్ పచ్చ చారల గోతాం పట్ట వొకటి తెచ్చి, గాట్లో ఎద్దల ముందరుండిన ఎండు కసువును కొంచిం ఎత్తుకోని బండ కింద ఆ ఎండు కసువేసి, ఆ ఎండు కసువు మింద గోతాం పట్ట పరిచి బాలింతరాలైన పిల్లికీ, దాని పిల్లలకీ పొడుకునే దానికి పక్క రెడీ జేసింది. బాలింతరాలైన పిల్లితో, "మనకు టయాలు బాగలేవు కూతరా. బిడ్డిల్ని పండేసుకోని గమ్మున ముడుక్కో నాయమ్మా!" అనేసి, యీ పనికి ఏమంటాదో ఏమోనని బిత్తర బిత్తరగా కూతురి కల్లా చూసింది మొదుటామె. కూతురు నోరు తెరవకపొయ్యే సరికి, యీది లేకీ, మళ్ల వూళ్లోకీ ఎగజూసింది. వూరు వూరంతా వొక్కరు గానీ లైట్లు ఆర్పలా. వూళ్లో ఆడోళ్లూ మొగోళ్లూ గూడా కటవలు గట్టినట్టుగా కటవలు గట్టి గుసగుసా ఏందో చెప్పుకుంటా వుండినట్టినిపించి యీది లేకి అడుగెయ్య బొయ్యింది మొదుటామె.

మొదుటామె కల్లా నాలుగడుగులేసి, "తల్లా, యిట్రా తల్లా! జరిగింది సాలు తల్లా, వూళ్లోకి పోబాక. బైసాట్లు తల్లా!" అని నడిపామె గొణిగినట్టు గొణిగిందే గాని ఓ అని కసిరేసినట్టుండాదా గొంతు. యీదిలేకి పోబోయిందల్లా మళ్లా గిరక్కన యెనక్కి తిరిగేసింది మొదుటామె. కూతురికల్లా చూస్తే కూతురు ఆ రొండు మాటలు గొణిగినందుకే బారడు పొడుగు గస పోసుకున్నట్టనిపిచ్చింది మూలింటి మొదుటామెకి.

వొక్కసారిగా వొళ్లు పొదురు బుట్టి పొయ్యింది మొదుటామెకి. కూతురికెదురుంగా వొచ్చి, నడుం మింద చేతులేస్కోని, "ఏంది మే నడుపమ్మీ, చెప్పమ్మే! బిడ్డి యాడబొయ్యింది మే!" అని కూతుర్ని పసిబిడ్డి అడిగినట్టుగా అడిగింది.

వున్నట్టుండి పురుగు నాకినట్టుగా అనిపించినట్టుండాది నారాయుడికి గూడా, యీ యింత సేపుటిగ్గానూ నోరంతా తెరిచి, చెల్లికల్లా జూసి, "ఆ యమ్మి యాడ బొయ్యింది నడుపమ్మీ!" అనడిగినాడు.

ఇంక కడుపులో పెట్టుకోలేనన్నట్టు, కడుపులో వుండిందంతా కక్కేస్తా, "నా బిడ్డిన్నీకు కట్టబెట్టి నీ గొంతు గోసినానన్నో. కూడు దినే నోటితో నీకెట్ట జెప్పేదన్నో! యిది పియ్యి దినే నోరన్నో – నీ పెళ్లాం – తూ – నా మొకాన అగ్గిబెట్టా, నా కూతురు నీ నెత్తిన గుండేసి కళాయి బోసే ఒక అంగుడు దుంగుడు నా బట్టను తొడుకోని తిరప్తికి పూడిసిం దంటన్నో. ఎడ పిలకాయలని గూడా అనుకోకుండా బిడ్డల్ని నీ ఎదానేసేసి ఒక అరవ మాదిగ నా బట్టతో–" అన్నను బట్టుకోని వో అని ఏడ్చేదానికి పెట్టుకొనింది నడుపమ్మి.

సదుగులు అట్టనే యిరిగి పొయ్‌నాయి మొదుటామెకి.

మూలింట్లో నుంచి వొక్కసారిగా ఆలగోడు బాలగోడుగా ఏడుపులినిపించే సరికి – వాళ్లంతటా వాళ్లే బైట పడినారు గదా యింక పర్వాలా అనుకోని చిటికేసినట్టుగా నాలుగిండ్లకా పక్కన్నుంచి తొలిగా ఆ యింటికొచ్చిన ఆడ మనిసి – రంజకం. బీకిబీకిగా వుండే రంజకం వెయ్యేనుగుల బలంతో వున్నట్టుండాదా టయంలో. గెంట కొట్టినట్టుగా నోరు తెరిచి, "ఏడస్తా పడతా తాంచారం చేస్తా వుండండీ, ఆ అరవ మాదిగి నా బట్టతో రేత్రికది నిద్ర జేస్తింది! లెయ్యండే, యిడిసి పెట్టిన లంజిలాలా లెయ్యండి, మళ్ల ఏడుద్దురు గాని తీరుబాటుగా. ఒరే ఆడింగి నా బట్టా లెయ్యావా పైకి. ఎన్ను మింద గువ్వ మాదిరిగా సాకిందానికి అది బాగ నాకిచ్చేసి పొయ్యిండ్లా. యీ రేత్రిని తెల్లారనీయ్యొచ్చంటే ముటాలి నా సవుతులాలా. ఒరే నారాయుడా లేచి నీ సరి మొగోళ్లను నలగర్ని పిల్చకరా వూళ్లోకి బొయ్! లాస్టు బస్సొచ్చే యాళయ్యింది, నలుగురు మొగోళ్లూ నలుగురాడోళ్లూ పోదాం పట్టండి. ఆ నా బట్టది టెంకాయలోడి కొటాయి పక్కనుండే దాసరి మటం. దాన్ని జుట్టు బట్టుకోని ఈడ్చుకొద్దారి. వొసే మొదుటి దానా, దాన్ని తొడకొచ్చేది యింక కాపరం చేసేదానిక్కాదు, సున్నపు రాళ్లల్లో యిడగ బోసేసే దానికి! నా మనవరాలు నా మనవరాలు అంటా అడ్డమొస్తే నిన్నుదంతా పూడ మింద!" అంటా గస పోసుకునింది రంజకం. ఎద్దుగాని ఆవురావురుమంటా తవుడు దినేటప్పుడు బుస పెడితిందే అట్ట బుస పెట్టింది రంజకం.

"వూరంతా తెలిసి పొయ్యిందా తల్లా, వూరంతా అగ్గెగిరి పొయ్యిందా! బిడ్డిలను కోకుండా, మొగుడనుకోకుండా మా మొకాన మసి పూసేసి పోతివా కూతరా!" అంటా లబలబా నోరు కొట్టుకో బొయ్యింది మొదుటామె.

నడిపామె ఏడ్చేది నిలిపేసి, "వూరంతా యింటి చుట్టూరా కటవలు కట్టీ బోతారు తల్లా! నువ్వు ఆగిత్తం పట్టించబాక, అయిన బైసాట్లు చాలు." అనింది మెల్లంగా. నడిపామె

యీ మాట అంటా వుండాదో లేదో రంగబిళ్ల బీడీ తాగతా కసువు పందిట్లోకి వచ్చినాడు. నారాయుడికి రంగబిళ్ల దాయాదు. మూడు నాలుగేండ్లు చిన్నోడు గానే వుంటాడు నారాయుడి కంటే. రంగబిళ్ల వొచ్చీ రాంగానే, నారాయుడితో, "లెయ్‌రా అడవ నాయాలా, జరగాల్సిన పన్జూడాల గాని ఆడ మద్దిస్తాలు చేసుకుంటా కుచ్చుందామా!" అంటా చేతికుండే గెడారం కల్లా జూసి, "టైమిప్పుడు రేత్రి పన్నెండేమీ అయిపోలా. ఏడూ ముక్కాలే. ఈలోగా మంచీ చెడ్డా మాట్లాడుకోని పది గెంటల బస్సుకు పది మందిమి ఎలబారదాము. అది యిడిసి పెట్టేసి పొయ్‌నంత మాత్రాన మనం గమ్మనుంటామా? అదాడిందే ఆటా? ఈ కత వూరి గెమిని దాటి పోగూడదు. ఆడ లంజిలు దీన్ని చాటవ మాదిరిగా చెప్పుకుంటా వుంటే యిన్న మొగోడు యిన్నట్టే మెట్టుతో కొట్టీయాల. చుట్టూతా రెడ్లు. రామాపురం రెడ్లు, నడవలూరు రెడ్లు, నెన్నూరు రెడ్లు, గంగరెడ్డిపల్లి రెడ్లు. యిన్నేండ్లూ రెడ్లేలతా వుంటే మనం నోట్లో యేలేస్కోని గమ్మనుండినాము. యిప్పుడునంగా మనోడు యేల్తా వుంటే రెడ్లు కక్కలేక మింగలేక మినకతా వుండారు. యీ టయంలో మన కమ్మిరికంలో వొకాడది యీ మాదిరిగా కళాయి బోస్కునే అరవ మాదిగోడితో పూడిసిం దంటే – యీ కత నాలుగూళ్లకూ తెలిస్తే మళ్ల మనం తిరప్తికి బస్సెక్కి పోగలమా! తెల్లారే కొందికి – అదెట్ట బొయ్యిందో అట్టనే తొడకొచ్చుకునీయాల. వూళ్లో ఒక పిట్టికోడి కూడా యీ కత బైటకు చెప్పుకో గూడదని పెతీ ఆడదీ మొగోడూ బజిన గుడికాడ మునిగి సత్యం జేసుకోవాల. లేకుంటే ఆడా మొగా తలకాయి లెత్తుకోని తిరగలేం. మన కయ్యా గాలవా రెడ్ల కయ్యాగాలవా అంతా పక్క పక్కన్నే గదరా. తల్చుకుంటా వుంటేనే బిత్తరగా వుండాది. నువ్వెంత నిమ్మళంగా వుండావో చూడు!"– నేను మాట్లాడేది చాలించినా, యింక మీ మాటేందో చెప్పండి అన్నట్టు ఆపినాడు రంగబిళ్ల.

రంగబిళ్ల ఆ చుట్టు పక్కలూళ్లల్లో కొంచిం పేరెత్తుకున్నోడే. మొన్నా నడుమ వాళ్ల నాయిన చచ్చిపొయ్ దినాలు జరిగితే యీ మద్దెనే తెలుగు దేశిం తరఫన కొత్తగా ఎమ్మెల్యే అయిన మునికిష్టమనాయుడు గూడా ఆ కార్యానికి వొచ్చుండినాడు. యిప్పు డిప్పుడే వూళ్లో బజినగుడి కాడ ఆ మద్దిస్తం యీ మద్దిస్తం పెట్టి తగరార్లను కూడా తీరస్తా వుండాడు.

రంజకానికి రంగబిళ్ల మాటలు బలే ఏం నచ్చలేదు. యిప్పుటికిప్పుడు మూలింటి కొనది కళాయి బోస్కునే వోడితో పూడిసిందనే కతను తోటోణ్ణి పిలిపించి యీ నాలుగూళ్లల్లో తుడుం గొట్టి చాటింపేసెయ్యాలన్నంత వుక్కురోసంతో వుంటే – రంగబిళ్లేమో దాన్ని తొడకొచ్చి సిరిచాప మింద దుప్పిటి పరిచి కుచ్చన బెట్టాలంటా వుంటే – చిటామని పించింది రంజకానికి. అదిగాన మళ్లా వూళ్లో కొస్తే 'కళాయోడితో పొయ్యిందానివి, నాతో దేనికుండవంటా దాన్ని లొంగేసుకోవాలని ఆశ పడతుండాడీ నా బట్ట' అని రంగబిళ్లను కడుపులోనే రంజకం తిట్టుకొనింది గూడా.

మూలింటామె యింటి ముందరుండే మిట్టమింద గంగెద్దులాట జరగతా వున్నట్టు వూళ్లో ఆడా మొగా అందురూ వుడ్డ జేరిపొయ్‌నారు.

నడిపామె రంగబిళ్ల కల్లా ఆశిగా జూసింది. యిప్పుడేమి జరిగి పొయ్యిందని, యింట్లో పీనిగ బడినట్టు మనం ఎంత మందిమి వుంటే అంత మందిమీ దిగ్గరిగి పోతుండాం! బిడ్డ గడప దాటి రొండు మూడు గెంటలయ్యుంటాదేమో. వూరంతా ఒకే తీగ. మనకు అందురూ అయినోళ్లూ పొయ్‌నోళ్లే. మన గుంపు పెద్దది. కళాయి బోసుకునే నా బట్టకు దిక్కా దిశా? పది మందిని తొడుకోని వాడింటి ముందరికి పోంగానే వుచ్చబోస్కోని మన బిడ్డని మంతో గూడా పంపించెయ్యడా? ఇంక మేనమామ తండ్రితో సమానం గదా. కూతురు జేసిన తప్పును మన అన్న కడుపులో పెట్టుకోడా – యిక్కవలిక్కవలుగా యోచన జేసే కొందికి నిమ్మళం అనిపిస్తుండాది నడిపామెకి.

రంజకం మాట్లాడిందానికీ, రంగబిళ్ల మాట్లాడిందానికీ మొదుటామెకి మాత్రం కడుపులో పేగులు గుంద్రించకొచ్చినాయి. రంజకం – కొడుకును బట్టుకోని ఆడింగుల్నా బట్టా అన్నప్పుడే పొల్లించి పొల్లించి తన్నాలనిపించింది మొదుటామెకి. రంగబిళ్ల మాటలు మాత్రం! సూదులు మాదిరిగా గుచ్చుకున్నాయి. రంగబిళ్ల – కొనమ్మిని వొదినగా తల స్తుండాడా! కాలం గాక గమ్మునుండాది మొదుటామె. మన బిడ్డ తప్పు జేసింది. పది మంది పది రకాలుగా అంటారు. వాళ్లకు నోళ్లుండాయి, మనకు చెవులుండాయి అనుకోని గమ్మన పడుండాల.

వున్నట్టుండి బిడ్డల్ని చూడాలనిపిచ్చింది మొదుటామెకి. బంద దిగి ఇంట్లేకి పొయ్ పిలకాయల కల్లా జూసింది. ఆడ చందమామ, మొగ చందమామ మాదిర్తో బిడ్డలు వొక పాపం మాకు తెలవదన్నట్టుగా తేటగా నిద్ర బోతుండారు. దుఃక్కంతో గుండికాయలు పెరక్కొచ్చినట్టయ్యింది మొదుటామెకి. అన్ని నీళ్లు దాగి బలంతాన అణసర జేస్కొనింది.

ఇంటి ముందర చేరినోళ్లు తలా ఒక మాట అనే దానికి పెట్టుకున్నారు.

"పదాం పట్టండి తిరప్తికి. మీకష్టమొస్తే మాకష్టమొచ్చినట్టు గాదా? ఎవురి శార్జీలు వోళ్లే పెట్టుకుందారి. యింటికొొక మనిసి ఎలబారదాం పట్టండి. లాస్టు బస్సు కాళీగానే వుంటింది గూడా. బస్సు పొల్లుగా వుంటే టాపు మిందయినా ఎక్కి పోదాం. బస్సోడు నిలపక పోతే బస్సుకడ్డంగా నిలబడదాం." అని వొక అమ్మ అంటే, యింగొకమ్మ, "వుండండి, వొక్కడుగులో గంగిరెడ్డి పల్లికి బొయ్ కోకా రైకా తెస్తా, దామోదర శెట్టిని నిద్దర్లేపి. సాంగిమెత్తుకోని బొయ్ దాన్ని పిలచకొద్దాం. సిగ్గులేని నా సవుతుల్లాలా దాని మొకం జూస్తే యింక గోవును జంపినంత పాతకం. బిడ్డిల మొకం గూడా చూడకుండా కేరేజాట్ అని తొలగ దోస్కోని పొయ్‌న లంజను కుయ్యోమొర్రో అని పిలచకొస్తారంట నట్టింట్లేకి. దానంతటది వూళ్లోకొచ్చినా దాన్ని కిరసనాయిలు బోసి ముట్టించేసినా పాపమా?" అనింది అక్కుసుతో.

ఒక అమ్మగన్నరాలు మాత్రం, "నా సవుతులాలా! నోర్లుండాయి గదాని గుక్క తిప్పుకోకుండా మాట్లాడతా వుండబాకండి. మూలింటోళ్ల కడపల్లో వుండేది చాలక వాళ్ల కడపల్లో యీ సూటీ పోటీ మాటలు మాట్లాడి యింకా దేనికే నిప్పులు బోస్తారు! వాళ్ల గెతి మీకు తిరగదా! మీరు మాత్రం బిడ్డా పాపను పెట్టుకోని లేరా! ఎవురన్నా కష్టంలో వుంటే అయ్యోమనేది నేర్చుకోండే లంజి నా సవుతులాలా!" అనింది. ఆమె ఎవురో గాదు. చీమంతమ్మ. చీమంతమ్మ మాటలు యినే దానికి సగించినాయి మొదుటామెకి. "ఒసే చీమంతా! నా ఆయుసు గూడా పోస్కోని నిండు నూరేండ్లు బతుకే!" అనింది మొదుటామె. చీమంతమ్మ మొదుటామె కంటే గూడా అయిదారేండ్లు చిన్నది. ఎవురన్నా ఒక పనిగా పోతా వుంటే వూరు వూరంతా గూడా చీమంతమ్మను పిలిచి ఎదురుంగా రమ్మంటారు. చీమంతమ్మ ఏదన్నా శాపిని పెట్టిందంటే అది తగల్తాదని గూడా వూళ్లో వోళ్లందురికీ బయం. ఆమెతో మాత్రం ఎవరూ తగరారు పెట్టుకోరు.

చీమంతమ్మ అందర్నీ తొలగదోస్కోని, "పొండే నా సవుతులాలా మీ కొంపలకు మీరు పొండే! జాతర మళ్ల జూద్దురు గాని పొండే నా సవుతులాలా పొండే!" అని ఆడ గుంపునంతా కసిరేసి నేరుగా కసువు పందిట్లో కొచ్చి నారాయుణ్ణి పట్టుకోని బొరోమని ఏడస్తా కావిలించుకోని, "నెత్తి బొలువైతే నేల దించొచ్చు. నీ గుండెల్లో వుండే బొలువును దేవుడే దించాల నాయినా. దిగులు పడొద్దు కొడుకా దిగులు పడొద్దు." అనింది.

అప్పటికీ నోరణగని రంజకం, "నడిపిదానా! ఆ నెత్తిన చేతులు దించు" అని అంటా, మొదుటామెతో "అది సడేగాని మొదుటి దానా! నాలుగైదు సవరాల బంగారును సంపారిచ్చి పెట్టుకోనుండావు గదా. నీ మనవరాలు మెళ్లో బొందారం తియ్యకుండా తిరగతా వుండిందే! బొందారంతో పాటు బంగారమంతా దొబ్బుకోని అరవ మాదిగోడితో గూడా దాసరి మటం చేరిందో, ముళబాగళే చేరిందో చూస్కోండి. ముందు బంగారు కత జూడండి..." అనింది, బలే టయానికి బంగారం గుర్తు కొచ్చిందే అనే కుశాలతో.

ఆ మాటతో గూడా మొదుటామె, "బంగారట్టా బిడ్డే పుడ్సినాక బంగారు బోతే ఎంత? నా వొట్టికాలి శెంటంతో సమానం." అనింది యాడలేని రోసంతో.

రంగబిళ్ల గూడా, "ఏమమ్మీ నడిపమ్మీ! ఏమిరా నారాయుడా! వుండే నగానట్రా బేంకీలో ఏమన్నా కుదవల్లో వుండాయా? మీరు అప్పు సప్పుల్లో గూడా లేరే! పోతాపోతా బంగారు దొబ్బకపొయ్యిందేమో చూడండి ఆ వుండే కాసింతైనా!" అని అన్నాడు.

లెక్కా పక్కా లేనట్టు మొదుటామె వుండిందేగాని నడిపామె మాత్రం చురుగ్గా కదిలింది. ఒక్కడుగులో అడ్డాపింట్లోకి పొయ్ టంకు పెట్టి తెరిసింది. ఈదిలో వుండే ఆడవాటికి తలలు పగిలిపొయ్యేటట్టుండాది. ముక్కాలు వాశి మంది – బంగారు దొబ్బుకోని పొయ్యుంటే బాగుండును అనే అనుకునేసినారు. రంజకానికా పేరు వూరికే పెట్టలా, 'బంగారు మాట ఎంత బాగా ఎత్తిందో చూడు రంజకం' అనుకున్నారంతా.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Mulintame**

* * *